# బీసీలకు అన్యాయంపై పొన్నాల ఆవేదన

- 'హస్తా'నికి లక్ష్మయ్య రాంరాం
- కాంగ్రెస్‌లో బీసీలకు గుర్తింపు లేదని ఏఐసీసీ అధ్యక్షుడికి రెండు పేజీల లేఖ
- ఆ పార్టీతో నాలుగు దశాబ్దాల బంధానికి తెగదెంపులు
- భూములు, విల్లాలు ఇచ్చే వారికే టికెట్లు అంటూ మండిపాటు
- ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో కలవరం

వరంగల్, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ పార్టీ బీసీ వర్గాలకు వ్యతిరేకమని మరోసారి స్పష్టమైంది. బడుగు బలహీన వర్గాల వారికి చట్టసభల్లో అవకాశాలు కల్పించే విషయంలో హస్తం పార్టీ అసలు వైఖరి తెలిసిపోయింది. పీసీసీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ నేత పొన్నాల లక్ష్మయ్య రాజీనామాతో కాంగ్రెస్ పార్టీ అసలు తీరు అందరికీ అర్థమైంది. అసెంబ్లీ ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం కల్పించాలని పొన్నాల లక్ష్మయ్య పదేపదే డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ అధిష్టానం ఎంతకీ పట్టించుకోవడంలేదు. హస్తం పార్టీ కేంద్ర నాయకత్వం, రాష్ట్ర నాయకత్వం బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండడంతో పొన్నాల కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ వర్గాలను తీవ్రంగా నిర్లక్ష్యం చేసేలా కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయాలు తీసుకుంటున్నది. పీసీసీలో, ఇతర పార్టీ కమిటీల్లో బీసీ వర్గాలకు ప్రాతినిధ్యం లేకుండా చేస్తూ వస్తున్నది. అసెంబ్లీ టికెట్ల కేటాయింపులోనూ ఇదే తరహా చర్యలు చేపడుతున్నది. ఎమ్మెల్యేగా పోటీ చేసేవారు దరఖాస్తు చేసుకోవాలని, ఇలా చేస్తేనే అభ్యర్థిత్వం కోసం పేరు పరిశీలిస్తామని చెప్పింది. టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారిని పట్టించుకోకుండా అభ్యర్థిత్వాల ఖరారుపై దృష్టి పెట్టింది. ఇతర పార్టీల్లోని వారికి, ముఖ్యంగా బీసీలకు ప్రాతినిధ్యం లేకుండా చేసేలా పీసీసీ నాయకత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఒక్కో స్థానానికి ముగ్గురు చొప్పున పేర్లను పీసీసీ నాయకత్వం కాంగ్రెస్ అధిష్టానానికి పంచించింది. ఈ ప్రక్రియలో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించే విషయాన్ని పూర్తిగా పక్కనబెట్టింది. కొత్తగా పార్టీలో చేరిన వారికి, టిక్కెట్ కోసం దరఖాస్తు చేసుకోని వారి పేర్లను ప్రతిపాదనల్లో పొందుపరిచింది. ఈ విషయంపై బీసీ వర్గానికి చెందిన నాయకులు తీవ్రంగా స్పందించారు. ఏఐసీసీ నాయకత్వం ఓ వైపు బీసీ గణన చేపట్టాలని నిర్ణయం తీసుకుంటే, పీసీసీ నాయకత్వం రాష్ట్రంలో బీసీ వర్గాలకు ప్రాతినిధ్యం లేకుండా చేస్తున్నదని ఈ వర్గం నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పదేపదే ఈ విషయాన్ని పీసీసీకి, ఏఐసీసీకి విన్నవించారు. బీసీ వర్గాల నేతల విన్నపాలను, ప్రతిపాదనలను పట్టించుకోకుండా కాంగ్రెస్ నాయకత్వం టికెట్ల ఖరారుపై నిర్ణయాలు తీసుకునే పనిలో నిమగ్నమైంది. ఈ తరుణంలో కాంగ్రెస్‌లోని బీసీ వర్గానికి చెందిన సీనియర్ నేత పొన్నాల ఆ పార్టీకి రాజీనామా చేశారు.

### నాలుగు దశాబ్దాల అనుబంధం..

పొన్నాల లక్ష్మయ్యకు కాంగ్రెస్ పార్టీతో నాలుగు దశాబ్దాల అనుబంధం ఉన్నది. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, 12 ఏండ్లు మంత్రిగా పని చేసిన అనుభవం ఉన్నది. 2014 సాధారణ ఎన్నికల సమయంలో పొన్నాల తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఇంతటి సీనియర్ నేతను పట్టించుకోకుండా కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేస్తూ వచ్చిందన్న అభిప్రాయాలున్నాయి. పొన్నాలతోపాటు బీసీ వర్గంలోని ముఖ్యనేతలను కాంగ్రెస్ పార్టీ ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్న తీరుపై కాంగ్రెస్‌లో ఇటీవల ఎక్కువ చర్చ జరుగుతున్నది. కాంగ్రెస్‌కు సంబంధించి వరంగల్ ఉమ్మడి జిల్లాలో అత్యంత సీనియర్ నేతగా ఉన్న పొన్నాల లక్ష్మయ్య తాజా నిర్ణయం ప్రభావం ఆ పార్టీకి ప్రతికూలంగా మారనుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పొన్నాలకు కాంగ్రెస్‌లో జరిగిన అవమానంపై బీసీ వర్గాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి. పార్టీ కోసం ఎంతో చేసిన పొన్నాలను, ఇతర బీసీ నేతలను కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యం చేయడం సరికాదని ఈ వర్గాలు అంటున్నాయి. వరంగల్ ఉమ్మడి జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీలో ఉన్న ఐదు స్థానాలు మినహా మిగిలిన ఏడు సీట్లలో మూడు స్థానాలను కాంగ్రెస్ గతంలో బీసీలకు కేటాయించేది. ప్రస్తుత ఎన్నికల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నుంచి ఒక్క బీసీకి కూడా టికెట్ కేటాయించే పరిస్థితి లేకపోవడం దారుణమైన విషయమని బీసీ నేతలు చెబుతున్నారు. బీసీలకు ప్రాతినిధ్యం కల్పించలేని కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పాలని అంటున్నారు.

### అదేబాటలో మరికొందరు..

బీసీల వ్యతిరేక వైఖరి అనుసరిస్తున్న కాంగ్రెస్ తీరుపై ఆ పార్టీలోని ఈ వర్గానికి చెందిన ఇతర నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ నాయకుడు పొన్నాల తరహాలోనే మరికొందరు నేతలు తీవ్ర నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఒక్క సీటు కూడా ఇచ్చే పరిస్థితి లేకపోవడంపై వీరంతా తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు సైతం పొన్నాల తరహాలోనే కాంగ్రెస్‌కు రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిన తర్వాత రాజీనామాల రూపంలో ఆ పార్టీకి మరిన్ని గట్టి దెబ్బలు తప్పవని బీసీ నేతలు చెబుతున్నారు.

# విధుల్లో చేరిన వరంగల్ సీపీ

- ఇన్‌చార్జి సీపీ డీసీపీ మురళీధర్ నుంచి బాధ్యతలు స్వీకరించిన అంబర్ కిశోర్ ఝా
- రాచకొండ కమిషనరేట్ నుంచి బదిలీపై ఇక్కడికి..
- గతంలో ఉమ్మడి జిల్లా ఎస్పీగా విధులు



సుబేదారి, అక్టోబర్ 13 : వరంగల్ పోలీసు కమిషనర్‌గా అంబర్ కిశోర్ ఝా శుక్రవారం విధుల్లో చేరారు. ఆయన గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్పీగా పని చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రస్తుత సీపీ ఏవీ రంగనాథ్ బదిలీ కాగా, ఆయన స్థానంలో అంబర్ కిశోర్ ఝాను రాష్ట్ర సర్కారు సీపీగా నియమించింది. 2009 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన మొదట ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏఎస్పీగా పని చేశారు. 2012లో ఉమ్మడి వరంగల్ ఓఎస్డీగా, అదనపు ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఎస్పీగా పదోన్నతి పొంది 2014లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పనిచేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత భద్రాద్రి కొత్తగూడెం తొలి ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. 2018లో హైదరాబాద్ సౌత్ జోన్ డీసీపీగా, అదే సంవత్సరంలో కేంద్ర సర్వీసుల్లో చేరారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో డీఐజీగా పదోన్నతి పొందారు. ఇటీవల రాచకొండ జాయింట్ సీపీగా నియమితులయ్యారు. కాగా, నూతన సీపీని సెంట్రల్, వెస్ట్ జోన్ డీసీపీలు బారి, సీతారాం, ఇతర పోలీసు అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## కటాక్షపురం బ్రిడ్జి వద్ద కారు బోల్తా

### ఆరుగురుకి స్వల్ప గాయాలు



కటాక్షపురం బ్రిడ్జి వద్ద బోల్తాపడిన కారు

ఆత్మకూరు, అక్టోబర్ 13 : మండలంలోని కటాక్షపురం చెరువు మత్తడిలో శుక్రవారం కారు బోల్తా కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా నుంచి కారు హైదరాబాద్ వెళ్తుండగా కటాక్షపురం చెరువు మత్తడి వద్ద బ్రేకులు ఫెయిల్ కావడంతో కారు అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో అందులోని ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి.

## రీజినల్ సైన్స్ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమాలు

హనుమకొండ, అక్టోబర్ 13 : హనుమకొండ హంటర్‌రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్ ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు సైన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సెంటర్ అధికారి వై నితీశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈ కార్యక్రమాలు ఉంటాయని, ఎంట్రీ (రిజిస్ట్రేషన్) ఫీజు ప్రతి విద్యార్థి రూ. 300 చెల్లించాలన్నారు. 16న రిజిస్ట్రేషన్, సైన్స్ సెంటర్ సందర్శన, సైన్స్ సూత్రాల వివరణ ఉంటుందన్నారు. 17న సైన్స్ అంశాలపై చిత్రలేఖనం, క్విజ్ పోటీలు, 18న సైన్స్‌పై ఆసక్తిని కల్గించేలా వివిధ అంశాలపై కార్యక్రమాల నిర్వహణ, 19న విద్యావేత్తల ఉపన్యాసాలు, సైన్స్ వీడియోల ప్రదర్శన, 20న విద్యార్థులకు అభ్యసన కార్యక్రమాలు ఉంటాయన్నారు. వివరాలకు 9676675770, 9849489754, 0870- 2431995 నంబర్లలో సంప్రదించాలన్నారు.

## క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

- విద్యా వ్యవస్థలో గురుకులాలకు ప్రత్యేక స్థానం
- వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- రాయపర్తిలో 9వ జోనల్ క్రీడా పోటీలు ప్రారంభం

రాయపర్తి, అక్టోబర్ 13 : క్రీడల్లో రాణిస్తే యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కలెక్టర్ పీ ప్రావీణ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో 9వ జోనల్ స్థాయి స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్‌కు గురుకులాల సొసైటీ ఆర్‌సీవో సూరినేని విద్యారాణి, గురుకులం ప్రిన్సిపాల్ ఉమామహేశ్వర్‌ల స్వాగతాలు పలికారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి క్రీడా జ్యోతిని వెలిగించారు. ఈ సదర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడా పోటీల్లో తరచూ పాల్గొనే విద్యార్థినులకు భవిష్యత్‌లో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించే గుణం అలవడుతుందని చెప్పారు. కార్యక్రమంలో క్రీడా పోటీల నిర్వాహకులు దేవీ సునీలాప్రభ, వెంకటేశ్వర్లు, జయలక్ష్మి, దేవీప్రసాద్, నాజియా బేగం, ప్రభావతి, కళమ్మ, హేమ పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

# ఇద్దరు మాజీ మావోయిస్టుల అరెస్టు

- మరో ఇద్దరు కొరియర్లూ పోలీసుల అదుపులో..
- జిలెటిన్ స్టిక్స్, విప్లవ సాహిత్యం స్వాధీనం
- వెల్లడించిన సీఐ బండారు కుమార్



పేలుడు సామగ్రితో పట్టుబడిన మాజీ మావోయిస్టులు, కొరియర్లను అరెస్టు చూపుతున్న సీఐ కుమార్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు

వాజేడు, అక్టోబర్ 13 : మండలంలో ఇద్దరు మాజీ మావోయిస్టులు, మరో ఇద్దరు కొరియర్లను పోలీసులు అరెస్టు చేశారు. వెంకటాపురం సీఐ బండారు కుమార్, వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం సీఆర్పీఎఫ్ సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఏటూరునాగారం నుంచి వెంకటాపురంకు రెండు మోటర్ సైకిళ్లపై వస్తున్న నలుగురు వ్యక్తులు పోలీసులను చూసి వెనక్కి తిప్పుతుండడంతో అలర్ట్ అయిన పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న బ్యాగులను సోదా చేయగా, జిలెటిన్ స్టిక్స్‌తోపాటు విప్లవ సాహిత్యం లభించింది. అనంతరం వారిని విచారించి జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలానికి చెందిన మాజీ మావోయిస్టులు కడారి యాదగిరి, కాలకోట ప్రభాకర్‌గా నిర్ధారణకు వచ్చారు. వీరు మావోయిస్టు పార్టీకి సానుభూతి పరులుగా పని చేస్తున్నట్లు నిర్ధారించారు. అలాగే ఈ ఇద్దరు మాయమాటలు చెప్పి శివరాత్రి పవన్ కల్యాణ్, ఎల్మకంటి మహేశ్‌ను మావోయిస్టు పార్టీలో చేర్పించేందుకు తీసుకెళ్తుండగా, నలుగురిని అరెస్టు చేసినట్లు చెప్పారు. నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి ప్రజలు సహకరించొద్దని సూచించారు.

## వైజ్ఞానిక ప్రదర్శనలో మెరిసిన మోడల్ స్కూల్ విద్యార్థి



వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న అఫ్రీన్, గైడ్ టీచర్

వెంకటాపూర్, అక్టోబర్ 13 : ఢిల్లీలో నిర్వహించిన ఇన్‌స్పైర్ మాక్ వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని జవహర్ నగర్ మోడల్ స్కూల్ విద్యార్థి అఫ్రీన్ సత్తా చాటింది. బోరు బావిలో పిల్లలు పడిపోకుండా ఆరు ఫీట్ల కేసింగును తయారు చేసింది. పిల్లలు ప్రమాదవశాత్తు బోరు బావిలో పడితే కేసింగ్ వద్దే ఆగిపోవడంతో పాటు తహసీల్దార్ ఆఫీస్, పోలీస్ స్టేషన్‌కు మెసేజ్ విత్ లొకేషన్ పంపించే విధంగా ఎగ్జిబిట్‌ను తయారు చేసి ప్రదర్శించింది. కాగా, బోష్ కంపెనీ ప్రతినిధులు ఈ ప్రాజెక్టు బాగుందని, తాము పరిగణలోకి తీసుకుంటామని చెప్పినట్లు గైడ్ టీచర్ కుమార్ తెలిపారు. ప్రిన్సిపాల్ శ్రీధర్ అఫ్రీన్, గైడ్ టీచర్‌ను అభినందించారు.

## 50 కిలోల గంజాయి స్వాధీనం

సుబేదారి, అక్టోబర్ 13 : ముగ్గురు గంజాయి స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేసి 50కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం హనుమకొండలోని వరంగల్ పోలీసు కమిషనరేట్‌లో సెంట్రల్ జోన్ డీసీపీ బారి వివరాలు వెల్లడించారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో ఒడిషా రాష్ట్రానికి చెందిన జన్కర్ మెహర్, మోహన్ చనల్, జ్యోతి ప్రకాశ్ దలాయి ఒడిషా, ఆంధ్రప్రదేశ్‌లో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో విక్రయించడానికి రెండు ముఠాలుగా ఏర్పడి రెండు వేర్వేరు రైళ్లల్లో బయలుదేరారు. భువనేశ్వర్ రైలు నుంచి వరంగల్ రైల్వే స్టేషన్‌లో దిగిన నిందితుడు జ్యోతి ప్రకాశ్‌ను పోలీసులు పట్టుకొని 17కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. శివనగర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న మరో ఇద్దరు నిందితులు మోహన్ చలన్, జన్కర్ మెహర్‌ను పట్టుకొని 33 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామని డీసీపీ తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, ఇంతేజార్‌గంజ్, మిల్స్‌కాలనీ సీఐలు శ్రీనివాస్, సురేశ్, సిబ్బందిని ఆయన అభినందించారు.



ముగ్గురు గంజాయి స్మగ్లర్లను అరెస్టు చూపిస్తున్న డీసీపీ బారి